క్లుప్తంగా

## గ్రానైట్ అసోసియేషన్ కార్యవర్గానికి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఖమ్మంరూరల్: ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్, కార్యవర్గానికి ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదాలత్ నరేందర్, వెంపటి ఉపేందర్, నూనావత్ కిషన్, షేక్ జానీ, నవీన్‌కుమార్, రహీం, గిరి శుభాకంక్షలు తెలిపి మాట్లాడారు. అనంతరం యుగంధర్ మాట్లాడుతూ రెండు యూనియన్లతో సత్సం బంధాలు కొనసాగిస్తూ సమస్యల పరిష్కారం లో పాలుపంచుకుంటామని తెలిపారు.

## మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

నేలకొండపల్లి: టూ వీలర్ మెకానిక్ కుటుంబానికి యూనియన్ ఆర్థిక సాయం అందించింది. నేలకొండపల్లికి చెందిన నరేశ్ పదేళ్లుగా మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు జిల్లా టూ వీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండల్‌రావు చేతుల మీదుగా రూ.25 వేల నగదును కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, ఎండీ జహంగీర్, లింగనబోయిన మురళి, పులుసు శ్రీనివాసరావు, మధు, లక్ష్మణ్, శాంతయ్య పాల్గొన్నారు.

## రేపల్లెవాడలో సివిల్ సర్వీసెస్ అధికారులు



అధికారులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కామేపల్లి: మండలంలోని జగన్నాథతండా జీపీలోని రేపల్లెవాడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర అంశాలపై సివిల్ సర్వీసెస్ అధికారులు వారం పాటు ఉండి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అందులో భాగంగా మంగళవారం మనీశ్ మీనా (ఐఎస్ఎస్), సులేఖ జాగర్వార్ (ఐపీఎస్), అరుళ్‌సెల్వన్ (ఐఎఫ్ఓఎస్), నీలేశ్ శ్రీకాంత్ గైక్వాడ్ (ఐపీఎస్), మధివధాని (ఐఎఫ్ఎస్) జగన్నాథతండా జీపీ కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులు వారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## బైక్‌ను ఢీకొట్టిన ఆటో

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై బైక్‌ను ఆటో ఢీకొట్టింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ద్వారకుంటకు చెందిన జె.లింగరాజు (40), వెంకటేశ్వర్లు (60) సోమవారం బైక్‌పై ఖమ్మం వెళ్తున్నారు. మండలంలోని గువ్వలగూడెం సమీపానికి రాగానే ఖమ్మం నుంచి కోదాడ వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. గాయపడిన లింగరాజు, వెంకటేశ్వర్లును 108 ద్వారా ఖమ్మం తరలించారు. కాగా, ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు.

## నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | దేవర పార్ట్-1 |
| వినోద | జనక అయితే గనక |
| సాయిరాం | విశ్వం |
| ఆదిత్య | రాధేకృష్ణ |
| శ్రీనివాస | వేట్టయన్: ద హంటర్ |
| సినీ గెలాక్సీ | ఇద్దరు |

- ఖమ్మం గాంధీచౌక్

## ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 50 | బచ్చలికూర | 3 |
| వంకాయ | 40 | | 20 |
| బెండకాయ | 38 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 58 | | 20 |
| కాకర | 34 | చుక్కకూర | 3 |
| బోడ కాకర | 100 | | 20 |
| బీర | 54 | తోటకూర | 3 |
| దొండ | 32 | | 20 |
| పొట్లకాయ | 50 | గోంగూర | 5 |
| చిక్కుడు | 70 | | 20 |
| గోరుచిక్కుడు | 48 | మెంతికూర | 2 |
| క్యాబేజీ | 34 | | 20 |
| క్యాలీఫ్లవర్ | 35 | కొత్తిమీర | 1 |
| ఆలుగడ్డ | 38 | | 50 |
| చామగడ్డ | 54 | పుదీన | 1 |
| క్యారెట్ | 54 | | 25 |
| క్యాప్సికం | 70 | -ఖమ్మం వ్యవసాయం | |

# ఆదాయంపై నజర్..

**ట్రేడ్ లైసెన్సు ఉన్న భవనాలకు కమర్షియల్ ట్యాక్స్**
- ప్రతీ వ్యాపారానికి ట్రేడ్ లైసెన్సులు
- సర్వేకు కేఎంసీ అధికారుల కసరత్తు
- రూ.1.50 కోట్ల మేర పెరగనున్న ఆదాయం



ఖమ్మంమయూరిసెంటర్: నగరాలు, పట్టణాల అభివృద్ధి ప్రధానంగా ఆదాయ వనరులపైనే ఆధారపడి ఉంటుంది. ప్రజలు చెల్లించే పన్నులు, పౌర సేవలందించేందుకు చెల్లించే రుసుములు, లైసెన్సుల మంజూరు ద్వారా ఆదాయం అధికంగా వస్తుంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి, పంపు పన్నుల తర్వాత ట్రేడ్ లైసెన్సుల ద్వారానే అధికంగా ఆదాయం సమకూరుతోంది. అయితే, పన్నుల వసూళ్లలో రాణిస్తున్న కేఎంసీ అధికారులు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయడంలో మాత్రం విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ట్రేడ్ లైసెన్సుల ద్వారా నగరంలో రూ.3 కోట్ల వరకు ఆదాయం పొందాల్సి ఉన్నా.. ఆ స్థాయిలో లైసెన్సులు జారీ చేయకపోవడంతో కేఎంసీ పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోతోంది. ఇక ట్రేడ్ లైసెన్స్ కలిగిన భవనాలకు కమర్షియల్ ట్యాక్స్ కాకుండా రెసిడెన్షియల్ ట్యాక్స్ విధిస్తుండటంతో కేఎంసీకి రావాల్సిన ఆదాయంలో గండి పడుతుంది. నగరంలో ట్రేడ్ లైసెన్సులు కలిగి, వ్యాపారం చేస్తున్న భవనాలకు కమర్షియల్ ట్యాక్స్ విధించేందుకు చర్యలు చేపట్టారు.

**పెరిగిన వ్యాపారం..**

నగరం విస్తరించడం, పలు అవసరాల రీత్యా నగరానికి వచ్చి వెళ్లే వారి సంఖ్య భారీగా పెరగడంతో ఇక్కడ వందలాది వ్యాపారాలు జరుగుతున్నాయి. వేలాది మంది దుకాణాలను ఏర్పాటు చేసి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో జనావాసాల కన్నా వ్యాపార వాణిజ్య సముదాయాలే ఎక్కువగా ఉన్నాయి. గాంధీచౌక్, కమాన్‌బజార్, కస్బాబజార్, వైరారోడ్డు, కాల్వొడ్డు, పీఎస్ఆర్ రోడ్డు, ట్రంక్‌రోడ్, జెడ్పీసెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, కొత్తబస్టాండ్ బైపాస్ రోడ్డు, మమతా రోడ్డు ఇలా అన్ని ప్రాంతాల్లో వేలాది సంఖ్యలో వ్యాపార దుకాణాలు ఉన్నాయి. వ్యాపార సముదాయాలు విస్తరిస్తున్నాయి. నగరంలో అనేక రకాల వ్యాపారాలు భారీగా పెరిగాయి. అనేక రెసిడెన్షియల్ భవనాల్లో ట్రేడ్ లైసెన్సులు పొంది వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇక అనేక వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు లేవు.

**ఆదాయంపై దృష్టి**

ట్రేడ్ లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తుండటం ఒక ఎత్తయితే.. వ్యాపారం నిర్వహించే భవనాలకు రెసిడెన్షియల్ పన్ను చెల్లించడం మరో ఎత్తు. కేఎంసీ పరిధిలో వ్యాపార సముదాయాలు కలిగిన భవనాలు తప్పనిసరిగా కమర్షియల్ ట్యాక్స్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే అనేక మంది భవన యజమానులు తమ భవనాలను వ్యాపారాలకు కిరాయిలకు ఇచ్చినా.. పన్ను మాత్రం రెసిడెన్షియల్ విధానంలోనే చెల్లిస్తున్నారు. దీంతో అధికారులు ట్రేడ్ లైసెన్సు కలిగిన ఇంటి నంబర్లను సర్వే చేసి ఆయా గృహాలకు కమర్షియల్ ట్యాక్స్ విధించడంపై దృష్టి సారించారు. ట్రేడ్ లైసెన్స్ కలిగి రెసిడెన్షియల్ పన్ను చెల్లిస్తున్న భవనాలు నగరంలో 1,200లకు పైగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు వాటికి కమర్షియల్ పన్ను విధించేందుకు సిద్ధమయ్యారు. వీటితో పాటు ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిని గుర్తించి వారికి ట్రేడ్ లైసెన్స్ జారీ చేసేలా సర్వే చేయించనున్నారు. ఈ సర్వే ద్వారా కేఎంసీకి రూ.1.50 కోట్లకు పైగా ఆదాయం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**అంతంత మాత్రంగానే..**

నగరంలో వ్యాపారాల నిర్వహణకు మున్సిపల్ యాక్ట్ ప్రకారం ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి. అయితే నగరంలో వ్యాపార సముదాయాలు 10 వేలకు పైగా ఉన్నా.. లైసెన్స్‌లు కలిగి ఉన్నది అధికారిక లెక్కల ప్రకారం 2024-25 ఏడాదికి 5,856 దుకాణాలు మాత్రమే. వీటికి రూ.2.83 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు రూ.80.05 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.56 కోట్లు ట్రేడ్ లైసెన్సుల ఫీజు వసూలు చేయాల్సి ఉండగా.. ఆ ఏడాది కేవలం రూ.1.35 కోట్లు మాత్రమే వసూలు చేశారు. దీంతో కేఎంసీలో ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజు అంతంతమాత్రంగానే వసూలు అవుతోందన్న విమర్శలు ఉన్నాయి.

**రెసిడెన్షియల్ భవనాలను వ్యాపార సముదాయాలుగా మార్చి..**

ప్రస్తుతం నగరంలో వాణిజ్య, వ్యాపారం పెరగడంతో వ్యాపారులు తమకు అనుకూలంగా ఉన్న భవనాలను కిరాయిలకు తీసుకొని వాటిల్లో లావాదేవీలు కొనసాగిస్తున్నారు. వేల సంఖ్యలో రెసిడెన్షియల్ భవనాలను వ్యాపారులు అద్దెలకు తీసుకొని వ్యాపార సముదాయాలుగా మార్చారు. అయితే ఈ భవనాలకు కమర్షియల్ ట్యాక్స్ కాకుండా రెసిడెన్షియల్ ట్యాక్స్‌ను కేఎంసీ అధికారులు విధిస్తున్నారు. దీనిని వరంగల్ డీఎంఈ గుర్తించి కేఎంసీ అధికారులను అప్రమత్తం చేశారు. ట్రేడ్ లైసెన్సులు ఉన్న భవనాలకు రెసిడెన్షియల్ పన్ను ఎలా విధిస్తారని, వాటికి కమర్షియల్ పన్ను విధించాలని డీఎంఈ ఆదేశించారు. నగరంలో 1,200 లకు పైగా రెసిడెన్షియల్ భవనాల ఇంటి నంబర్లపై ట్రేడ్ లైసెన్సులు జారీ అయ్యాయని, ఆయా భవనాల నుంచి ఇప్పటికీ రెసిడెన్షియల్ పన్ను వసూలు చేస్తున్నారని, వెంటనే వాటికి కమర్షియల్ ట్యాక్స్ విధించాలని డీఎంఈ కేఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# అప్పటికప్పుడే పరిష్కరించండి..



ఖమ్మంమయూరిసెంటర్: దరఖాస్తును పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య



నేలకొండపల్లి: ప్రజావాణిలో ఎదురుచూస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అదేరోజు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆర్‌ఓను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. శానిటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులు రాగా అవి శానిటేషన్ సూపర్‌వైజర్‌కు ఇచ్చి రేపటి ఉదయానికల్లా పరిష్కరించి ఫొటో పంపాలన్నారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఏసీపీకి కమిషనర్ సూచించారు. ప్రతి సెక్షన్ నుంచి ఒక సిస్టమ్ ఆపరేటర్‌తో కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆ కౌంటర్లలో దరఖాస్తులు అక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

**ప్రజావాణికి స్పందన కరువు**

నేలకొండపల్లి: స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రజావాణికి స్పందన కొరవడింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అన్ని శాఖల అధికారులు ప్రజావాణికి హాజరై.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దరఖాస్తుదారుల కోసం ఎదురుచూశారు. ప్రజావాణిని వినియోగించుకోవాలని తహసీల్దార్ జె.మానిక్‌రావ్ సూచించారు. ఎంపీడీఓ ఎర్రయ్య, ఎంఈఓ చలపతిరావు, పీఆర్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్

**రహదారి ఏర్పాటు చేయాలని వినతి**

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు ప్రాథమిక ఆస్పత్రి నుంచి గుండెపుడి వరకు రైతులు పంట పొలాలకు వెళ్లే మార్గాన్ని రహదారిగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ తహసీల్దార్ పీవీ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గతంలో రైతులు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఆచరణ సాధ్యం కాలేదని, ప్రభుత్వం రహదారి ఏర్పాటు చేసి రైతుల కష్టాలు తొలగించాలని కోరారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం

**పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రదర్శన, కలెక్టరేట్ ముట్టడి**



ర్యాలీగా వస్తున్న నాయకులు, విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో రూ.6,500 కోట్ల మేర స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. నాయకులను పోలీసులు అడ్డుకోగా ధర్నాచౌక్‌కు వెళ్లి నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెడితే, గాడిలో పెడతామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు వినయ్, చంద్రశేఖర్, పృథ్వీ, సందీప్, ప్రసాద్, అనిత, కావ్య, దీప్తి, యశ్వంత్, స్టాలిన్, మాల్సూర్, సాయి, కరుణ, వీణ పాల్గొన్నారు.

# ఇంటి నంబర్లు కేటాయించాలి..



మాట్లాడుతున్న జతిన్‌కుమార్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం వెలుగుమట్ల గుట్టపై వినోబానగర్‌గా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న నిరుపేదల ఇళ్లకు ప్రభుత్వం నంబర్లు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని టీపీడీఆర్ ఉమ్మడి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జతిన్‌కుమార్ డిమాండ్ చేశారు. కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఉన్న నంబర్లను మనుగడలోకి తీసుకురావడమే కాక మిగిలిన ఇళ్లకు నంబర్లు కేటాయించాలని, ప్రైవేట్ వ్యక్తుల స్థలాలకు హద్దులు తేల్చాలన్నారు. అంతేకాక ప్రైవేట్ పట్టాదారుల ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు ఇక్కడి ప్రజలను అరెస్ట్ చేయడం ఆపివేయాలని డిమాండ్ చేశారు. వెలుగుమట్లలో సుమారు 62 ఎకరాల భూదాన్ భూమి ఉన్నందున 11 ఏళ్లుగా నివాసముంటున్న పేదల విషయంలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని, పోలీసులు కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామీణపేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య, నాయకులు సీహెచ్ఎస్ఎన్ మూర్తి తదితరులు మాట్లాడారు.

# అప్పుల పాలు చేసింది బీఆర్‌ఎస్సే..

నేలకొండపల్లి: రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ తీరు కారణంగా ప్రస్తుతం నెల నెలా రూ.6 వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేశ్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, వెంకన్న, రాయపూడి నవీన్, నల్లాని మల్లికార్జున్‌రావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేశ్, గుండా బ్రహ్మం, లక్కం ఏడుకొండలు, వేగినాటి లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు. కాగా, రామచంద్రాపురం సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు పి.కోటేశ్వరరావు తదితరులు చైర్మన్ దంపతులను సన్మానించారు.

# పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి..



నివాళులర్పిస్తున్న ఎస్ఐ సంతోష్

నేలకొండపల్లి: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరవలేనివని ఎస్ఐ పి.సంతోష్ తెలిపారు. సోమవారం ఆయన పోలీస్ అమరులకు నివాళులర్పించి మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల సంరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయని చెప్పారు. హెడ్‌కానిస్టేబుళ్లు లక్ష్మి, ఖాసీం, సీతారాములు, కానిస్టేబుళ్లు ముదుసు రామకృష్ణ, రాజేశ్, భూక్యా హరి, సైదులు, హోంగార్డ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తీర్ణత పెంపునకు కృషి చేయాలి



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఏఎంఓ

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ (ఏఎంఓ) అధికారి కె.రవికుమార్ సూచించారు. మండలంలోని కూసుమంచి, గోరీలపాడు, పెరికసింగారం పాఠశాలలను ఎంఈఓ రాయల వీరస్వామితో కలిసి సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల నిర్వహణను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యత అందించాలని తెలిపారు.

# 'ఉపాధి' అంతా అవినీతిమయమే..

కామేపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో అక్రమార్కులు అందినకాడికి దండుకున్నారు. వలసల నివారణే ధ్యేయంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని అవినీతికి కేరాఫ్‌గా కామేపల్లి మండల ఫీల్డ్ అసిసెంట్లు, ఈజీఎస్ సిబ్బంది మార్చేశారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం చేపడుతున్న తనిఖీల్లో ఫీల్డ్ అసిసెంట్లు, ఈజీఎస్ సిబ్బంది చేతివాటం వెలుగులోకి వస్తున్నాయి. మండలంలోని కొత్తలింగాల, జోగ్గూడెం, ముచ్చర్ల, బాసిత్‌నగర్, పొన్నేకల్, తాళ్లగూడెం, గరిడేపల్లి గ్రామాల్లో ఆయా జీపీ కార్యదర్శుల అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో జరిగిన వివిధ పనులపై డీఆర్పీలు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను సభలో చదివి వినిపించారు. మండలంలోని పొన్నేకల్ గ్రామంలో మస్టర్‌లో కూలీల హాజరు, సంతకాలు లేకపోయినప్పటికీ పేమెంట్ చేసినట్లు గుర్తించారు. కూలీలు చేసిన పని దినాల కంటే 12 రోజులు ఎక్కువగా చేసి చూపినట్లు తెలిపారు. అంచనా వేసిన కొలతల ప్రకారం కాకుండా ఎంబీలో అదనంగా రికార్డు చేశారు. మండలంలోని ముచ్చర్ల, బాసిత్‌నగర్ గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు రికార్డులను అప్పగించలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ సాంబశివచారి, ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, డీఆర్పీ, వీఎస్ఏ, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నివారణపై కళాజాత

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కళాజాత నిర్వహించారు. పోలూరి రాము జానపద కళాబృందం ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణరావు, అధ్యాపకులు చంద్రమౌళి, నర్సింహారావు, శ్రీధర్‌కుమార్, శ్రీనివాసరావు, ఉపేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.



కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

# మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లి మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు రేఖ ముత్తయ్య కుటుంబాన్ని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, పొట్ల కిరణ్ సైదులు, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ జడల నగేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ముత్తయ్య కుటుంబాన్ని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు రామసహాయం అరవింద్ రెడ్డి, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.



ముత్తయ్య కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

# ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీవిశాలక్ష్మి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అన్నదానం చేశారు. ప్రతి వారం అన్నదానం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతోపాటు కార్పొరేటర్ నాగండ్ల కోటి పాల్గొన్నారు. కార్యక్రమం నిరంతం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్: ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన క్రీడాపోటీల్లో తమ విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ.నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. విద్యార్థులను వారు సోమవారం అభినందించి మాట్లాడారు. అండర్-17 విభాగం ఫుట్‌బాల్‌లో బి.మహీధర్, ఆర్పీ ధ్రువరాజ్, ఎ.మోక్షజ్ఞ తనీస్, అండర్-17, 14 టేబుల్ టెన్నిస్‌లో ఆర్.చార్విక్, ఎస్‌కే ఫజల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా.. మహీధర్ జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు.

## ఆర్థిక సాయం

కామేపల్లి: కారేపల్లి మండలం వెంకిట్యాతండాకు చెందిన గుగులోత్ హరికిషన్ ఉన్నత చదువులకు లండన్ వెళ్లగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. హరికిషన్ తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడం ఆస్పత్రిలో ఖర్చులకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న యునైటెడ్ కింగ్‌డమ్ గోర్ బంజార అసోసియేషన్ అందించిన రూ.40 వేల చెక్కును కామేపల్లి ఎస్ఐ సాయికుమార్ చేతుల మీదుగా సోమవారం హరికిషన్‌కు అందించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ గుగులోత్ రమేశ్, సీతారాములు, ధరావత్ అంజయ్య, శంకర్ పాల్గొన్నారు.

## పరామర్శ



నివాళులర్పిస్తున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాకు చెందిన కిసాన్ గ్రూప్స్ నిర్వాహకుడు చల్లపల్లి శ్రీను తల్లి రాధమ్మ ఇటీవల మృతి చెందగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాధమ్మ చిత్రపటం వద్ద నివాళులరిపంచారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పుచ్చకాయల సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.